# సంపెంగపువ్వు

"ఆమె ఈ బండికి వొస్తుందని నీ కెట్లా తెలిసింది?" అని శాస్త్రిని అడిగాను. అప్పుడు ఆరుగంట లవుతుంది. బొంబాయి నుంచి రైలు వొచ్చే టైం. నేనూ శాస్త్రీ ప్లాటుఫారంమీద నుంచోని మాట్లాడుకుంటున్నాం.

"ఇవ్వాళే వైరిచ్చింది" అన్నాడు శాస్త్రి. ఆమె శాస్త్రి స్నేహితురాలట. ఆమె ఈ బండికి వొస్తుందని చెప్పి నన్ను వెమ్మట పెట్టుకొచ్చాడు శాస్త్రి.

శాస్త్రి ఆమెని గురించి చెప్పిన మాటల్నిబట్టి ఆమె విచిత్ర వ్యక్తి అనిపించింది నాకు. "బలే మనిషి. బలే మనిషి" అంటాడు శాస్త్రి. ఏమడిగినా "నువ్వే చూస్తావుగా" అంటాడు. "ఏమో నబ్బా, నాకు చెప్పటం చాతగాకుండా వుంది. మన సంఘంలో ఇటువంటి మనిషి వుండదు. వొచ్చే సంఘంలో ఆడవాళ్లు ఇట్లా వుంటారేమో! ఇప్పుడు రష్యాలో ఏమన్నా వున్నారేమో!" అంటాడు.

"అయితే ఆమె భర్త ఏం చేస్తుంటాడు?" అని అడిగాను. ఆమెని గురించి ఇంకా ఇంకా ఇంకా తెలుసుకోవా లనిపిస్తూ వుంది నాకు.

"ఏదో చేస్తూనే వుంటాడు లాగుంది. ఆమె మాట్లాడితే 'కామేశ్వరుడుఅటువంటివాడు, ఇటువంటివాడు, ఎంతచలాకీగా వుంటా డనుకున్నాన్!' అని చెపుతూ వుంటుంది."

"భర్తంటే చాలా ప్రేమ కాబోలు..."

"ఆమెకు మొత్తం నలుగురు పిల్లలు—ఒక మొగపిల్లవాడూ ముగ్గురు ఆడపిల్లలూ" అన్నాడు శాస్త్రి కొంటెగా.

నిజంగా ఆమెకు పిల్లలనే టప్పటికి నామనస్సు కలుక్కుమంది. మిగిలిన ఆడవాళ్ళకుమల్లే ఈ బలేమనిషికూడా పిల్లలా? ఎందుకనోగాని ఈభావాన్నే నేనుభరించలేకపోయాను.

ఇంతలో, "అదిగో రైలు వొస్తూవుంది" అన్నాడు శాస్త్రి. ఆ మాటకి నా హృదయం దడదడ కొట్టుకుంది.

అకస్మాత్తుగా ప్లాటుఫారానికి చలనం కలిగింది. ఇద్దరు ప్రయాణీకులు ప్లాటుఫారం అంచునుంచి సామాను సర్దుకొని దూరంగా నుంచున్నారు. ఒక ముసలమ్మ మూట నొక చేత్తో, మనమణ్ణి ఒకచేత్తో పట్టుకొని నిలబడింది. ఒక రైతు నుంచున్నవాడు నుంచున్నట్టుగానే హడావడి పడుతున్నాడు. కాసేపు కర్రని చుట్టా, చుట్టని కర్రా అనుకొన్నాడు.

రైలు ఆగీఆగటంతోనే 'మూడోతరగతి' అని జ్ఞాపకం చేశాడు లక్ష్మణశాస్త్రి. ఆమె ఎప్పుడూ మూడో తరగతి లోనే ప్రయాణం చేస్తుందిట. ఆమెకు ఒంటరితనం గిట్టదట. అందుకని జనసమ్మర్దంగావున్న మూడో తరగతి చూచి అందులో ప్రయాణం చేస్తుందిట. ఆమెకు ఎంత ఇరుగ్గా వుంటే అంత సరదాగా వుంటుందిట! నాకు ఆమెను వెతకాలని వుంది గాని కాళ్ళాడక అక్కడే దిక్కులు చూస్తూ నుంచున్నాను.

అది చిన్నస్టేషను. ఎక్కువమంది దిగరు.

"అదిగో దిగుతూవుంది," అని గార్డుపెట్టెవైపుకి చూపిస్తూ అన్నాడు లక్ష్మణశాస్త్రి.

నేనూ చూశాను. నాకు కనబడలేదు. అటూ యిటూ చూశాను. కనబడలేదు.

"హల్లో" – ఎదురుగా వొస్తున్న ఒక వ్యక్తితో కరస్పర్శ చేస్తూ అన్నాడు లక్ష్మణశాస్త్రి, ఆ వ్యక్తి ఓవర్ కోటులో వుంది. చేతిలో తోలుసంచి వుంది.

"మీరు రారనుకున్నాను," అంటున్నాడు.

"అదేమిటి? ఎందుకు అలా అనుకోవటం?" అంటున్నది.

ఆ ఓవర్‌కోటులో వున్న వ్యక్తి ఆమే అని అప్పుడు నాకు తెలిసింది. మామూలు స్త్రీ ఆకారం కోసం వెతుకుతున్న నా చూపులు ఓవర్‌కోటులోవున్న ఆమెను పట్టుకోలేక పోయినయ్. నేను మళయాళంలో వున్నప్పుడు ఇటువంటి అవస్థలోనే వుండేవాణ్ణి. గూడకట్టు కట్టుకొని తుండుగుడ్డ భుజాన వేసుకునే ఆ స్త్రీలు నాకంటికి ఎప్పుడూ పొరపాట్న అయినా స్త్రీలుగా కనిపించే వాళ్ళు కాదు. ఇప్పుడూ ఆదుర్గతే పట్టింది.

లక్ష్మణశాస్త్రి అంటున్నాడు – "ఆపేక్షవున్నచోటే భయం కూడా వుంటుంది. మీరు రావాలనే ఆపేక్షతోపాటు, మీరు రారనే భయంకూడా ఎక్కువైంది."

ఆమె నవ్వి, "కామేశ్వరుడు కూడా ఇట్లాగే మాట్లాడు తాడు" అంది.

ఆమె భర్త పేరు ఎత్తేటప్పటికి లక్ష్మణశాస్త్రి కించ పడి, టాపిక్ మార్చటానికి ప్రయత్నించాడు. నన్ను పరిచయం చేస్తూ, "ఇతడు శరశ్చంద్ర బాబు. నాకు పరమ స్నేహితుడు. కథలు రాస్తూ వుంటాడు. సినిమాలతో సంబంధం వుంది. మంచి......"

ఆమె లక్ష్మణశాస్త్రి చేతిని వొదలకుండానే నన్ను ఎగాదిగా చూచి, "మీకథలు కొన్ని చదివాను. మీకథలే బాగుంటై" అంది...... ఆమె శాస్త్రి యింట్లో దిగింది!!

ఆ రాత్రి నిద్ర పట్టకపోటం వల్ల తెల్లవారి కొంచం ఆలస్యంగా లేచాను. త్వరగా కాలకృత్యాలు తీర్చుకొని ఆమెను చూట్టానికి లక్ష్మణశాస్త్రి ఇంటికి వెళ్లామా వొద్దా అని ఆలోచిస్తూ కూర్చున్నాను. ఇంతలోకి లక్ష్మణశాస్త్రి వొచ్చాడు. "ఒకసారి మాయింటికి రావోయ్. ఆమె పిలుచుకు రమ్మన్నది" అన్నాడు.

"ఎందుకు?" అని అడిగాను. లోపల వెళ్లామని వుంది. ఆమె వూరికేనే పిలుస్తూ వుందని తెలుసు. అయినప్పటికీ అప్రయత్నంగా ఇలా అడిగేశాను.

లక్ష్మణశాస్త్రి నన్ను విచిత్రంగా చూచి, కాసేపు ఆగి, "సరేలే, రా" అన్నాడు. నేను బయల్దేరాను.

మేము వెళ్ళేటప్పటికి లక్ష్మణశాస్త్రి స్నేహితులూ, వూళ్ళో కుర్రవాళ్ళు కొంతమందీ వున్నారు. ఆమె వాళ్ళమధ్య కూర్చొని కబుర్లు చెపుతూ వుంది. నన్ను చూచి, "ఏమండీ పిలిస్తేగాని రావొద్దనుకున్నారా?" అని నవ్వుతూ అడిగింది.

"మావాడికి ఆడవాళ్ళని చూస్తే సిగ్గు," అన్నాడు శాస్త్రి.

అంతా నవ్వారు. ఆమెమాత్రంచిన్నపుచ్చుకుంది. కారణం నాకు బోధపడలేదు గాని ఎందుకో బాధ పడుతున్నట్టుమాత్రం స్పష్టంగా కనిపించింది. అదైనా కాసేపే! మళ్ళీ యథా ప్రకారము అందరితోనూ కులాసాగా కబుర్లు చెప్పటం మొదలు

పెట్టింది. తన అనుభవాలు, కథలు కథలుగా వర్ణించిచెప్పింది. చివరికి "మీకు నాకున్న అనుభవంలో పదోవంతు కూడా లేదు" అంది.

నిజమే. అందరూ అంగీకరించారు. "కాబట్టి వయస్సుమాట ఎట్లా వున్నా మీ అందరికీ నేను తల్లిని" అంది.

ఈమాట మా మధ్య పిడుగు పడినట్లు పడింది. కొందరు సిగ్గుపడి తలవొంచుకున్నారు. కొందరు వెకిలి నవ్వు నవ్వారు. కొందరు తెల్లబోయారు.

నాకు ఇంకొక లోకంలో వున్నట్లు వుంది. ఆమె మాత్రం వీటిని గమనించినట్లు యథాప్రకారం మాట్లాడుతూనే వుంది. అందరినీ ఒకే మోస్తరుగా పలకరిస్తూ మాట్లాడింది. సెక్సుని గురించి ఆమె ఫ్రీగా మాట్లాడుతూవుంటే కుర్రవాళ్ళంతా కిక్కురు మనకుండా విన్నారు. అవునూ, కాదూ అంటాని కూడా వాళ్ళకు ధైర్యం లేకపోయింది. ఊకొట్టటానికే వాళ్ళకు సిగ్గువేసింది. 'నేనుస్త్రీని' అనే భావం ఆమెకు చచ్చినా గుర్తుకురాదు. నాకు చాలా సంతోషం వేసింది. కాని "పూర్వం సంతానానికి స్త్రీ పురుష సంపర్కం అవసరం లేనట్లు కనుపిస్తుంది. ఇప్పుడు అవసరం; కొన్ని సంవత్సరాలకు మళ్ళీ అవసరం లేకుండా పోవొచ్చు" అని ఆమె చెవుతూవుంటే నామనస్సుకూడా చివుక్కుమంది.

కొంచంసేపు అయింతర్వాత మేము కాఫీహోటలుకి బయుల్దేరాం. ఆమెకూడా మాతో వొచ్చింది. చూస్తే ఎవ్వరు ఏమనుకుంటారో అని నాకు అమిత కంగారుగా వుంది. కాని ఆమెకు ఏమని చెప్పటం?

మేము దారినే వెళ్తుంటే జనం గుంపు గుంపులు పడి విచిత్రంగా చూస్తూ హేళన చెయ్యటం నేను గమనించాను. ఆమెను గురించి ఒకటి రెండు మాటలు నా చెవిని పడినై. హోటలునుంచి బయటపడి కొంపకి జేరదామని అంతా త్వరగా కాఫీ ముగించారు. ఆమెమాత్రం తొందరపడలేదు.

"ఏదీ ఆ హల్వా ఇట్లా వుంచండి," అని సుబ్బారావు ప్లేట్లోవున్న హల్వాలో సగం తీసుకుంది. "ఈబూంది కొంచెం తీసుకోండి," అని శాస్త్రి ప్లేట్లోకి తన బూందిని చెంచాతో సగం నెట్టింది.

ఇక మిగతా టేబిల్సు చుట్టూవున్న జనం రుసరుసలు చెప్పాలీ!

సాయంకాలం పార్కుకి వెళ్ళాం. అక్కడా ఇంతే. అక్కడి వాళ్ళంతా మమ్మల్ని మ్యూజియంలో జంతువుల్ని చూచి నట్టు చూట్టం మొదలు పెట్టారు, ఏం జరుగుతున్నా ఆమెలో మాత్రం ఏమీ మార్పు కనపట్టంలేదు. కాని నేను కమిపెట్టిన వాటిల్లో మరీ విచిత్రం అయిన విషయం ఏమిటంటే ఆడ వాళ్ళతో మాట్లాట్టానికి ఆమె నాకంటే సిగ్గుపడేది. లక్ష్మణ శాస్త్రి భార్యతో తలవంచుకొని మాట్లాడేది. ఆమె వేసే ప్రశ్నలకు జవాబులు చెప్పటానికి అమిత సిగ్గుపడేది.

"మీకు పిల్లలు ఎంతమందండీ?"

"...............''

"మీ పెద్దపిల్ల, పెళ్ళియీడుకు వొచ్చిందా?"

"..........''

"మీరిట్లా తిరుగుతూవుంటే మీ పిల్లలకు ఆలనా పాలనా ఎట్లా జరుగుతుంది ?"

"............"

"ఈ చీరె ఎక్కడ కొన్నారు ? దీని రంగు నిలవదండీ !"

"............"

"ఈ జాకెట్టుకి కుట్టుకూలీ ఏం యిచ్చారు ?"

ఇటువంటి ప్రశ్నలకు జవాబులు చెప్పలేక ఆమె తబ్బిబ్బు పడేది. మర్యాదగా జవాబులు చెప్పాలని ప్రయత్నించేది గాని జవాబులు దొరకకో, అలవాటులేకో ఉక్కిరి బిక్కిరి అయ్యేది. ఇంతేకాదు. పసిపిల్లల్ని చూసినా అంతే! ఏం అంతా మాట్లాడుకునే సమయంలో శాస్త్రి పిల్లవాడు "అమ్మా' అంటూ ఆమె వొళ్ళో దూరితే ఆమె పడిన భయం నేనెప్పుడూ మరచి పోలేను. వొళ్ళో తేలు పడ్డట్టు ఉలిక్కిపడ్డది, శాస్త్రి భార్య, "తిరగమోత మాడుతూవుంది. కొంచం పిల్లవాడ్ని చంక వేసుకోండి. చూచివస్తాను" అని చెప్పి ఆమెకు పిల్లవాణ్ణి అందించినప్పుడు ఆమెపడ్డ యాతన ఆ పరమాత్ముడికే తెలియాలి. పిల్లవాణ్ణి చంకన వేసుకోవటం చాతగాక శాస్త్రి భార్య పొయ్యిమీద చట్టినిపట్టుకున్నట్లు పట్టుకుంది. కాని ఎంత బాధ అయినా ఆమె మరుక్షణమే మరచిపోయేది. ఇవతలికి వొచ్చి ఏమీ జరుగనట్టుగానే యధాప్రకారం మా అందరితోనూ కులాసాగా కబుర్లు చెప్పేది. ఆసంగతే ఎత్తేది కాదు.

భోజనంచేసి ఆమెను గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను. ఇంతలో ఆమె కూడా శాస్త్రి యింట్లో భోజనం పూర్తిచేసుకొని వొచ్చి "సినిమాకి వెళ్దాంరండి," అని అడిగింది.

నేను కొంచెం తటపటాయించి, "శాస్త్రి ఏడీ?" అన్నాను.

"శాస్త్రి లేకపోతే మీరు రారా ?"

"ఎందుకు రాను ?"

"ఇంకేం ? రండి."

"బండి పిలిపిస్తాను,"

"నడిచి పోదాం."

ఇద్దరం బయల్దేరాం. రోడ్డుమీద ఎవ్వరూ నడవటంలేదు. మ్యునిసిపల్ లాంతరు స్థంభాలు మిణుకు మిణుకు మంటూ కాపలా కాస్తున్నై. దూరంగా అప్పుడప్పుడూ గుర్రపు బళ్ళ వోటిమోత వినిపిస్తూవుంది. మేమిద్దరం పక్క పక్కనే నడుస్తున్నాం. చలికి ఆమె శాలువా కప్పుకుంది. అందుకని నాకు ఆమె స్త్రీగా కనపట్టంమానేసింది కొంచెంసేపయింతర్వాత ఆమె ఒక్క నిట్టూర్పు విడిచి ఇలా అంది—"మీ వూరు చాలా వెనకబడి వుందండీ !"

నాకేమీ తోచక, "శాస్త్రికూడా వొస్తే బాగుండేది" అన్నాను.

ఆమె ఒక్క క్షణం ఆగి, "చాలా వెనకబడివుంది," అని తనలో తాను అనుకుంటున్నట్లు అన్నది.

"లేకపోతే బొంబాయి వున్నట్లు వుండమంటే ఎట్లా వుంటుంది ?" అన్నాను.

"వూరు సంగతికాదు—మనుషుల సంగతి. నేను వొచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. మీరు మాంధాత కాలంలో వున్నారు. అబ్బా, మీరీ వూళ్ళో ఎలా బతుకుతున్నారో! ఒకరితో మాట్లాడితే ఇంకొకరికికోపం. అందరితో మాట్లాడితే

అందరికీ కోపమే! దీన్నే ఈర్ష్య అంటారు కాబోలు. శాస్త్రి ఇంట్లో మీ అందరి సంగతి గమనించాను. కాఫీహోటలుకి వెళ్ళేటప్పుడు వూళ్ళోవాళ్ళసంగతి చూచాను. ఏం అన్యాయం? అన్నీ ప్రిమిటివ్ లక్షణాలే! ఆడవాళ్ళ పని మరీ అన్యాయంగా వుంది. ప్రతి భార్యా తన భర్తని ఇతర స్త్రీలనుంచి కాపాట్టమే తన ధర్మంగా నటిస్తుంది. తన భర్తతో మాట్లాడే ప్రతి స్త్రీ తనభర్తను కాజెయ్యటానికే ప్రయత్నిస్తూవుంది అనుకుంటుంది. ఎంత ప్రిమిటివ్! మీరంతా మాంధాత యుగంలోవున్నారు."

నేనేమీ మాట్లాడలేదు. ఆమె మాటలు యదార్థం అని నాకు తెలుసు. ఆమె వొచ్చిం దగ్గరనుంచీ మా జీవితంలోని అమానుషత్వం నాకు స్పష్టంగా కనిపిస్తూనే వుంది.

"మీరు తెలివిగలవాళ్ళు. చాలామందికంటే తెలివిగలవాళ్లు మీరు అనుకుంటున్న దానికంటే తెలివికలవాళ్ళు. అందుకని మిమ్మల్ని చూస్తూవుంటే నాకు ముచ్చటగా వుంటుంది. కాని ఏం లాభం? మీ చుట్టూవున్న సంఘంలో మీరూ వొకరు అవటంవల్ల మీలో కూడా ప్రిమిటివ్ ఇన్‌స్టింక్ట్సు చాలా వున్నయ్. మొదటనుంచీ నేను మిమ్మల్నిగమనిస్తూనేవున్నాను మీరిక్కడవుండి చెడిపోతున్నారు. మీకొక్క సలహా చెప్పుతాను. మీరిక్కడ స్త్రీలక్లబ్బు ఒకదాన్ని ఆర్గనైజుచెయ్యండి. ఆడవాళ్ళని కొంచం కలిసి మెలిసి తిరిగేటట్టు చేస్తే తప్ప ఈ పశుత్వంపోదు. నా మాట వినండి."

ఈమాటలు మేం బతుకున్న బతుకునంతా ఒక్కసారి జ్ఞాపకానికి తెచ్చినయ్. భార్యల్ని ఇళ్ళల్లో పెట్టటం—బజార్ల వెంట తుకిడీలు తుకిడీలుగా తిరగడం—ఏ స్త్రీ అయినా కని

పిస్తే కోతిచేష్టలు చెయ్యటం — ఆడవాళ్ళ సంగతే సదా మాట్లాడుకోవటం — అంతా అసహ్యంగా కనిపించింది. ఈ మధ్య మావూళ్ళో ఆడవాళ్ళకోసం జరిగిన హత్యలు జ్ఞాపకం వొచ్చినై. వీటికన్నిటికీ కారణం ఆమె చెప్పిందేనా? ఆమె మాటలకు సమాధానం చెప్పకుండా ఆలోచనలో పడ్డాను. ఆమె కూడా గ్రహించినట్లువుంది. మళ్ళీ ఆసంగతి ఎత్తలేదు.

హాల్లో ప్రవేసించింతర్వాత మొత్తం రెండు మూడు సార్లు మాట్లాడించింది. ఒకసారి "నాకు, ఛార్లెస్ బోయర్ అంటే యిష్టం. కామేశ్వరుడికి గ్రేటా గార్బో అంటే యిష్టం" అంది.

"ఛార్లెస్ బోయర్ అంటే ఎవరికి యిష్టం వుంటుందో నాకు తెలుసు. కాని మీకు యిష్టం అవటం నాకు చాలా ఆశ్చర్యంగావుంది," అన్నాను.

"ఎందుకని?"

"అతడు చాలా మాస్కులైన్‌గా వుంటాడు. అతడు ముద్దు పెట్టుకుంటూవుంటే తెర చిరుగుతుందేమో నని భయం వేస్తుంది నాకు."

ఆమె చిరునవ్వు నవ్వుతూ, "చిరిగితే చిరిగిందిలే! అనిపిస్తుంది నాకు" అంది. కొంచెంసేపు వుండి, "విరుద్ధస్వభావాలు ఆకర్షించుకుంటాయి అనుకోవటం పాత సిద్ధాంతం" అని నెమ్మదిగా చెప్పింది.

ఇంకా కొంచంసేపు వుండి, "మీరన్న మాటకి నాకొక విషయం జ్ఞాపకం వొస్తూవుంది. మీతో చెప్పక పోవటం ఎందుకు? మా వూళ్ళో ఒక మహిళా సంఘంలో సభ్యురాలి

నిగా జేర్చుకోమని అప్లికేషన్ పెట్టుకున్నాను. వాళ్ళు నా అప్లికేషన్ తిరగగొట్టుతూ, 'ఈ సంఘం స్త్రీలకుమాత్రమే,' అని రాసి పంపారు," అని బిగ్గరగా నవ్వటం మొదలు పెట్టింది. నాకుమాత్రం ఆమెను చూస్తే జాలివేసింది.

మళ్ళీ సినిమా చూస్తూకూర్చొన్నాం—

మొదటి రాత్రి తెల్లవారగానే కథానాయకుడూ, కథానాయకీ అత్యుత్సాహంగా చెట్టుకొమ్మ పట్టుకొని వొకళ్ళూ పువ్వు వాసన చూస్తూ వొకళ్ళూ డూయట్‌సాంగ్ పాడుతూ వుంటే, "ఈ సీను మీకు ఎట్లా వుంది?" అని అడిగింది.

"బాగోలేదు. ఆమె కాసేపు సిగ్గు అభినయిస్తే బాగుండేది!" అన్నాను.

"ఎందుకని?"

"గతరాత్రి అనుభవం ఆమెకు ప్రథమం చూడండీ. అందుకని అతని మొహం చూచీ చూట్టంతోనే సిగ్గుజనించటం సహజం," అన్నాను

"అమెకు ఆ అనుభవం ప్రథమం అని మీకెట్లా తెలుసు?" అని నవ్వింది. నవ్వుతూ తన చేతులో వున్న సంపెంగపువ్వు నా చేతిలో పెట్టింది. నాకు పువ్వులంటే ఇష్టం లేకపోయినా వాసనచూస్తూ కూచున్నాను.

"గ్రేటాగార్బో క్వీన్ క్రిస్టినా చూశారా?"

"ఆఁ"

"ఆసీను ఎట్లా వుంది?"

ఆమె ఏ సీనుకి రిఫర్ చేస్తూ వుందో నాకు తెలిసింది. ఆ సీన్లో గ్రేటాగార్బో పక్కన పడుకునే వరకూ ఆమె కుర్రవాడు

అనుకుంటాడు హీరో అకస్మాత్తుగా తెలుస్తుంది ఆమె కుర్రదని ఆసీను ఎట్లా వుందని ఆమె నన్ను అడుగుతూ వుంది.

"బాగుంది."

"...ఆషాట్ ఎట్లా వుంది?"

ఆమె ఏషాట్ని గురించి అడుగుతూ వుందో నాకు తెలిసింది. కాని ఆమె ఆషాట్ అందం అడగటం లేదు. ఆషాట్లో వున్న గ్రేటాగార్బో సంగతి అడుగుతూ వుంది. గార్బో వొదులొదులుగా వున్న చొక్కాతో నిలబడి వుంది. లోపల మరేమీ లేదు. అది ఎట్లావుంది? అని అడుగుతూంది నన్ను.

"అసలు గార్బో చిత్రాలు చూస్తుంటే నాకు ఊపిరి సలపక ఒకరకంగా ఉంటుంది. అట్లా అవటం నాకిష్టం వుండదు."

అమె మాట్లాడ లేదు.

సినిమాహాల్లోనుంచి బయటికి రాగానే ఆమె యిట్లా అన్నది. "ఇక ఈ వూళ్ళో నేను బతకలేను. మీరంతా ప్రిమిటివ్ పీపుల్. నాలుగువందల సంవత్సరాలకిందటిజీవితాన్ని ప్రస్తుతం మీరు గడుపుతున్నారు. మిమ్మల్ని చూస్తూవుంటే బారువా చిత్రాల్లోని కోయవాళ్ళు జ్ఞాపకం వొస్తున్నారు. బారువా నవ నాగరిక కుటుంబాలను చూపించి, చూపించి, అకస్మాత్తుగా కోయగూడెంలో ప్రేక్షకుల్ని పడేస్తాడు. ఇతరచోట్లు చూచి, మీవూరు వొచ్చిన నాపని ఇప్పుడట్లావుంది. ఇక ఇక్కడ నేను బతకలేను. రేపే వెళ్ళిపోతాను."

ఆమె ఇంకా కొన్నాళ్లు ఈవూళ్ళో వుండాలని నాకు వుంది. ఆమె వుంటే మా జీవితాలు కొద్దిగానైనా మారవొచ్చు అనే

ఆశకూడా వుంది. కాని నా ఉద్దేశాలన్నీ ఆమెతో చెప్పుకోలేక "రేపు ఒక్కరోజు వుండగూడదూ?" అన్నాను.

"వుండను. నేను నిజంగా చెబుతున్నాను. ఈ వాతావరణంలో ఒక్క క్షణంకూడా బతకలేను. టార్జాన్ చూశారుగా! ఆ మృగాల మధ్య, ఆ మహారణ్యంలో, ఆ టార్జాన్ పక్కన వున్న పిల్లని చూస్తే నాకు అమిత భయం వేసేది. ఇప్పుడు మీవూళ్ళో మీమధ్య నాపని ఆ పిల్ల పనిలాగే వుంది. ఎలా వుండగలను! వుండను"

మర్నాడు పొద్దున్న నేనూ లక్ష్మణశాస్త్రీ మరి కొంత మంది స్నేహితులం కలిసి ఆమెను బొంబాయి రైలు ఎక్కించి వొచ్చాం. ఎక్కించి వొచ్చాం అంటే ఆమె ఎక్కింది, మేం చూస్తూ నుంచున్నాం.

ఆమె నా జీవితాన్ని మార్చివేసింది. నా దృష్టి పూర్తిగా మారిపోయింది. ఇంతకు ముందు ఏపని చెయ్యబోయినా ఇన్‌సెంటివ్ వుండేదికాదు. ఇప్పుడా తత్వం పోయింది. హుషారు ఎక్కువైంది. ఇదివరకు ఎవ్వరయినా ఉపన్యాసానికి పిలిస్తే వెళ్ళబుద్ధి అయ్యేదికాదు. ఇపుడలాకాదు. కథలు రాయాలనీ, ఉపన్యాసా లివ్వాలనీ, పదిమందిచేత మెప్పులు పొందాలనీ అపేక్ష కలిగింది. అన్నిటికంటే పెద్దమార్పు, చేతులూ కాళ్ళూ మొహం రోజూ వీలుచిక్కినప్పుడల్లా శుభ్రంగా తోము కోవటం. నాలో కలిగిన మార్పుకి ఇవి ఉదాహరణలు మాత్రమే! ఏపని చెయ్యబోయినా ఎవ్వరితో మాట్లాడబోయినా, ఏదో జీవిత రహస్యం తెలుసుకున్నట్టు, తారకమంత్రోపదేశం పొంది

నట్టు, సంతోషంగా వుండేది. ఆమె మాటలూ - ఆ చనువుగా వుండీ వుండకుండా వుంటం - చనువుగా వుంటూనే లొల్లిగా వుండకుండా వుంటం - నిర్భయంగా అన్ని విషయాలూ చర్చించటం - ఆమెని తలుచుకొన్నప్పుడల్లా హృదయం ఉప్పొంగేది. స్త్రీ మొగవాడితో తిరిగితే పాడై పోతుంది అంటారే ఎంత పొరపాటు మాట !!

ఆ నాటి సాయంకాలం లక్ష్మణశాస్త్రి ఇంటికి వెళ్ళాను. అతనితో ఆమెను గురించి కాసేపు ముచ్చటిద్దామనే వుద్దేశంతో వెళ్లాను. ఆమెని గురించి తలుచుకున్నా, ఆమెని గురించి మాట్లాడినా, ఆమె పక్కన కూర్చుని నవ్వుతున్నట్లు వుండేది నాకు. నేను వెళ్ళేటప్పటికి లక్ష్మణశాస్త్రి ఇంట్లో సుబ్బారావూ, కృష్ణారావూ, వెంకటేశ్వరరావూ వున్నారు. లక్ష్మణశాస్త్రి వాళ్ళ కేదో చెపుతున్నాడు. వాళ్ళుకూడా ఆమెను గురించే మాట్లాడుతున్నారని నేను కనిపెట్టాను. పాపం వాళ్ళని చూస్తే నాకు జాలివేసింది. వాళ్ళు దిగులుగా కూర్చున్నారు. ఆమె వెళ్ళిపోగానే వాళ్ళ జీవితాలన్నీ ఒక్కసారి అయోమయం అయిపోయినై. చెట్టు ఆశ్రయం పోయిన పక్షుల్లా అయిపోయారు. తల్లి ప్రేమను పోగొట్టుకొన్న పిల్లల్లాగా కూర్చున్నారు. "నేను మీ తల్లిని" అని ఆమె చెప్పన మాట నా చెవుల్లో గింగురుమంది.

నేను వెళ్ళి కూర్చోగానే లక్ష్మణశాస్త్రి "ఏమోయ్ మన కృష్ణారావు ఏమంటున్నాడో విన్నావా? ఆమెను మళ్ళీ పిలిపించి మహిళాసంఘాలు ఆర్గనైజ్ చేయించాలంటున్నాడు."

"మంచిదేగా! తగిన సన్నాహాలు చేసి పిలిపించండి" అన్నాను. నాక్కూడా ఆ కోర్కెవుందని చెప్పటం నాకు ఇష్టం లేక అలా అన్నాను.

"పిలిపించండి అంటేకాదు, మేము రాస్తే వొస్తుందో లేదో నువ్వు రాయాలి..." అన్నాడు కృష్ణారావు.

"మనకోసం వస్తుందా? ఎవ్వరు రాసినా ఒకటే" అన్నాను.

"అదేమిటి? స్నేహం మంచీ చెడ్డా వుండవ్! నువ్వంటే ఆవిడకు గురి..." అన్నాడు సుబ్బారావు. సుబ్బారావు చూపులూ, వైఖరీ నాకేమీ నచ్చలేదు. అసలు మొత్తంఅంతా విచిత్రంగా వుంది. వాళ్ళ స్వభావమే విచిత్రంగా మారినట్లు వుంది. వాళ్ళ ధోరణి చూస్తే నాకు కోపం వచ్చింది.

"అందరం స్నేహితులమే! ఇందులో కాందెవరు? అన్నాను.

"మా స్నేహాలదేముందిలే! మావన్నీ ఉత్తుత్తి స్నేహాలు. మాతో స్నేహంచెయ్యటానికి, మేమేమన్నా కథలురాస్తామా? హ్యూమరస్‌గా మాట్లాడి నవ్విస్తామా? సినిమాలకు వెంట బెట్టుకు పోతామా?" అన్నాడు సుబ్బారావు.

ఆఖరి మాటకు అంతా విషపునవ్వు నవ్వారు. కృష్ణారావుకి ఎన్నడూ ఆరోగ్యం సరిగ్గా ఉండకపోవడంవల్ల ఏమొచ్చినా ఆపుకోలేడు. విరగబడి నవ్వటం మొదలు పెట్టాడు. వాళ్ళ సంభాషణమాట అటుంచి, వాళ్ళనవ్వుకూడా నాకు సహజంగా కనబడలేదు. క్షణక్షణానికీ నాకుకోపం ఎక్కువ అవుతూవుంది.

నేను సుబ్బారావువంక తీక్షణంగా చూచి, "నీ తెలివికి సంతోషించాను. ఇకనైనాఆపు?" అన్నాను.

లక్ష్మణశాస్త్రి చిలిపినవ్వు నవ్వుతూ, "ఎందుకోయ్, అంత ఉలుకూ? వాళ్ళన్న మాటల్లో తప్పేముంది? మీరు సినిమాకి తిరిగినమాట నిజమేనాయె! మా అందర్లోకీ ఆమెను నువ్వంటే మనసున్న మాట అందరికీ తెలిసిన విషయమే! మొగా ఆడా అన్న తర్వాత, కలిసి తిరగటం మొదలు పెట్టిం తర్వాత..."

"శాస్త్రీ...!! అని గద్దించాను,

అతడు నామాట లెక్కచేయలేదు. వింతధోరణిలోమాట్లాడుతూవున్నాడు—"తప్పేముందోయ్? ఆమెనంగనాచా?..."

అంతా గొల్లున నవ్వారు.

నాకు తపన పుట్టింది "ఆమెను ఒక్కమాట అన్నావా, నేను వూరుకోను," అని గట్టిగా అరుస్తూ లేచి నుంచున్నాను.

నాకు కోపం ఎక్కువ అవుతున్నకొద్దీ శాస్త్రికి చిలిపితనం ఎక్కువ అవుతూంది. కొంటె నవ్వుతో అతని మొహం నిండిపోయింది.—చూశారా, ఆవిడమాట అంటే అతనికి ఎంత కోపమో! మనం ఆమెని ఒక్కమాటకూడా అనగూడదట! మీరు శ్రద్ధగా వినండి. ఒక్కమాట కాదు. వెయ్యిమాటలంటా–ఆమె మహాపతివ్రత. ఈ మధ్య సినిమాలో ఆమె పాతివ్రత్యం కాపాట్టానికి ఈతగాడు ప్రయత్నించాడు. ఆమె..."

ఇంతవరకే అన్నాడు. కాని ఆమెనీ అతడు అనబోయే మాటలన్నీ నాకు ముందే వినబడినై. ఆ మాటలు నా చెవిని పట్టం నాకు యిష్టంలేదు. క్షణక్షణం పెరుగుతూ వచ్చిన కోపాన్నీ తట్టుకోలేకపోయాను. ఇంతలో శాస్త్రి "పుష్పం మకరందం భ్రమరం" అంటున్నాడు.

ఇకేముందీ? అమాంతంగా శాస్త్రిమీదకువెళ్ళాను. అతణ్ని నేను ఎన్ని దెబ్బలు వేశానో, తర్వాత ఏమయిందో నాకు తెలియలేదు. కాసేపటికి నేను నుంచున్నాను. సుబ్బారావూ క్రిష్ణారావూ వెంకటేశ్వర్రావూ కిందపడివున్న శాస్త్రిని నెమ్మదిగా లేపుతున్నారు. అతని చూపులు చూస్తే నాకు జాలి వేసింది. నేను ఇటువంటి పనికి పూనుకుంటానని అతడు ఎప్పుడూ అనుకొని వుండడు. నన్ను జాలిగా చూస్తూ అతడు "నీకు పిచ్చెత్తిం"దన్నాడు.

*

నేను చేసినపనికీ నాకు ఏమాత్రం పశ్చాత్తాపం కలుగలేదు. ఎందుకు్కలుగుతుంది? మంచీ చెడూ తెలియకుండా, అనే మాటా, అననిమాటా తెలియకుండా నోరుపారేసుకుంటే ఎట్లా వోర్చుకోవటం? వాళ్ళు నాకు స్నేహితులే కావొచ్చు. అయితేమాత్రం? అందులో ఆమెని గురించా?

ఆమె అటువంటిమనిషేనా? ఆ మాత్రం వాళ్ళు తెలుసుకోవొద్దూ! ఆమెపక్కన కూర్చున్నా, ఆమెతోకలిసి మాట్లాడినా, ఆమెతోకలసి నవ్వినా, అటువంటి చెడు ఆలోచనేరాదే! ఏదో లోకంలో, మబ్బుల్లో, శరీరాలే జ్ఞాపకానికిరాని భావనలో సంచారంచేస్తున్నట్టు వుంటుందే! అటువంటి ఆమెకా ఇటువంటి నీచస్వభావం అంటగట్టటం? వీళ్లుకూడా అందరికిమల్లే స్త్రీ పురుషుడితో తిరిగితేచాలు చెడిపోయితీరారాలిఅనే అభిప్రాయంలోనే వున్నారు. ఇక స్నేహితులైతేమాత్రం వీళ్ళని నేను ఎందుకు సహించాలి?

నిజంగా నేను చేసిన పనికి నాకు చాలా సంతోషంవేసింది. వాళ్ళకు తగినట్టు బుద్ధిచెప్పాననే తృప్తికలిగింది.

ఒకొ్కక్కప్పుడు, జరిగింది జరిగినట్టు ఆమెకు రాద్దామనిపించేది. మళ్ళీ ఆమెమనస్సుని కష్టపెట్టినవాళ్ళం అవుతామేమోనని వస్తాయించి వూరుకునేవాణ్ణి. అటువంటి ఆమె కొంతమంది తననిగురించి ఇట్లా అనుకుంటున్నారని తెలిసినా, కొంతమంది మనుషులు ఎంత నీచంగా ఆలోచిస్తారో తెలిసినా, ఎంతబాధపడుతుందో, ఆమె పవిత్రహృదయం ఎంత కొట్టుకుంటుందో నాకు తెలుసు. అందుకని ఇక్కడ జరిగిన సంగతులు ఆమెకు ఏమీ రాయకుండా వూరుకున్నాను.

కాని అయిదోరోజు ఆమెదగ్గరనుంచే నాకు వుత్తరం వొచ్చింది. నాకు ఎంతఆశ్చర్యంవేసిందని? ఇక నా ఆనందానికి అంతేలేదు. గబగబా ఉత్తరంచించి చదివాను. ఆ వుత్తరం రావటం నాకు ఆశ్చర్యంకలిగిస్తే, ఇక ఆ ఉత్తరంలోని సంగతులు చదివేటప్పటికి. నా హృదయం ఆగిపోయినట్లయింది. ఆమె ఉత్తరం ఇది......

"నేను బాగానేఉన్నాను. ఇంటికి నలగని పువ్వల్లే జేరాను' వొచ్చినప్పటినుంచీ మీకు ఉత్తరం రాద్దామనుకుంటున్నాను. కాని మీకు ఉత్తరం ఎలారాయాలో బోధపట్టంలేదు. ఏంరాస్తే ఏమనుకుంటారో, నేను రాయదలిచింది మీకు అర్థంఅయ్యేటట్టు రాయగలనో లేనో అని భయంవేసి మెదలకుండా వూరుకున్నాను. నేను నిజంచెపుతున్నాను. మీకుఅర్థంఅయ్యేభాష నాకు రాదు- ఒకవేళ వొచ్చినా మరచి పోయివుంటాను.

"ఇవ్వాళ లక్ష్మణశాస్త్రి దగ్గరనుంచి ఉత్తరం వొచ్చింది. మీరేమీ ఆశ్చర్యపడవొద్దు. మేమిద్దరం స్నేహితులంఅనే విషయం మీకు తెలిసిందేగదా ! ఆ ఉత్తరంలో అతడుసంగతు లన్నీ విపులంగా రాశాడు. అతనికీ మీకూ జరిగిన పోట్లాట అంతా రాశాడు. అతడేమీ అబద్ధాలు రాయలేదు. తనతప్పుని కప్పిపుచ్చుకోటానికి ఏమాత్రం ప్రయత్నించలేదు. అక్షరాలా జరిగింది జరిగినట్టుగానే రాశాడు. అ ఉత్తరం చదువుతూవుంటే నాకు అపరాధపరిశోధకనవల చదువుతూ వున్నట్లు వుంది. స్టంట్ పిక్చర్ చూస్తూవున్నట్లు వుంది.

"ఏమండీ, మీరు నా ఆనర్ డిఫెండు చెయ్యటానికేనా శాస్త్రితో పోట్లాడింది? అతన్ని కొట్టటంకూడా నాకోసమేనా? నిజంగా ఆ దృశ్యం ఊహించుకుంటూఉంటే—మీరేగిన ఉంగ రాల జుట్టూ, ఎర్రబడ్డ కళ్ళూ, ఆవేశంతో చేతులూ కాళ్ళూ ఒణకటం, లక్ష్మణశాస్త్రి కిందపట్టం, మీరు మీదకు దూక టం, జుట్టు పీకటం, మొహం రక్కటం—ఇవన్నీ ఊహించు కుంటూ వుంటే నాడియామీద నాకు అభిమానం హెచ్చుతూ వుంది. మాట వరసకు అంటం కాదు. నాడియా అంటే నాకు పూర్తి అభిమానం. జనాన్ని గుంపులు గుంపులుగా వడేసి హంటర్‌తో ఏం కొడుతుందండీ!

"మీరు చూపిన షివల్రీ నన్ను ఆకర్షిస్తూవుంది. గాలిపటం మీద ప్రయాణం చేసి, మీ ముందు నా కృతజ్ఞతను చెప్పా లనిపిస్తూ వుంది. మీ ముందు కూర్చొని మీకు నా కృతజ్ఞతను తెలుపుకుంటూ నమస్కరిస్తే మీరు నాచేతులు

పట్టుకొని లేపి, "దీనికి మీరింత పొగడాలా? నా ధర్మం నేను నెరవేర్చాను..." అంటారుకదూ? ఇటువంటి సీను ఏదో సినిమాలో చూచినట్లు జ్ఞాపకం. ఇటువంటి సీన్లు నాకు బాగుంటాయి కూడాను.

కాని ముందు మిమ్మల్ని ఒక్కమాట అడగాలని వుంది. దానికి మీరు సవ్యంగా జవాబుచెప్పితే రెక్కలు కట్టుకొచ్చి మీముందువాలి, ఆసీను యాక్టుచేసి పోతాను. ఆ మాట ఏమిటంటే అసలు నేను, నంగనాచినని మీకెట్లా తెలిసింది? మీరు నన్ను గురించి అలా అనుకోటానికి ఆధారా లేమిటి? నామాటలుగానీ నాచేష్టలుగానీ అటువంటి అవకాశం కలిగించినయ్యా? అలా కలిగించివుండవు. ఎందుకంటే నేను నిజంగా నంగనాచినికాదు. లక్ష్మణశాస్త్రి మీకు యదార్థమేచెప్పాడు. నాకు నంగనాచిని కావాలనే అపేక్ష కూడా లేదు.

"మీరు నన్ను అపార్థం చేసుకోవద్దు. ఉన్న సంగతి వున్నట్టుగా చెపుతున్నాను. మీరు చూపిన షివల్రీ విషయం కూడా నాకు ఒక అనుమానం వుంది. ఆడవాళ్ళని రక్షించవలసిన బాధ్యత పురుషులమీద వుంది అనే అభిప్రాయమే ఈ షివల్రీకి కారణం అనిపిస్తూ వుంది నాకు. ఈఅభిప్రాయానికీ స్త్రీ పురుషుడి ఆస్తి అనే అభిప్రాయనికీ చాలా దగ్గర సంబంధం వుంది. నా ఆస్తి అనుకున్నప్పుడూ, ఆ అస్తి తన్ను తాను కాపాడుకోలేని స్థితిలోవుంది అనుకున్నప్పుడేగా రక్షించ వలసిన అవసరం కలిగేది. నేను ఒకరోజు మీతో తిరిగి, ఒకరాత్రి కలిసి సినిమా చూసినంత మాత్రాన నన్ను

గురించి మీరిట్లా అనుకోటం - నా ఆనర్ని కాపాడవలసిన బాధ్యత మీ మీద ఉందనుకోటం చాలా అన్యాయం. లక్ష్మణశాస్త్రి మొదలయిన వాళ్ళకీ మీకూ భేదం ఏముంది? నేను ఇంకొకళ్ళ ఆస్తి నయ్యాననే అసూయతో వాళ్ళు మీ దగ్గర నోటికి వొచ్చినట్లు మాట్లాడారు. మీ ఆస్తిని హేళనచేస్తున్నారనే భావంతో బాధపడి అవమానపడి మీరు వాళ్ళతో దెబ్బలాడారు. ఇక భేదం ఏక్కడ? మీరు నాకోసం పోట్లాటం, ఖాళీ కోటని రక్షించటానికి ప్రాణాలు వొడ్డి పోట్లాడే రసపుత్ర వీరుని శౌర్యం, ధైర్యం, సాహసం జ్ఞాపకానికి తెస్తున్నది.

"మీకూ, మీ కథలకూ ఎంత భేదం వుందండీ! మీ ప్రవర్తన వేరు, మీ రచనలు వేరు. ఒకటి వెనక్కు లాగుతూ వుంటే ఒకటి ముందుకు లాగుతూ వుంటుంది. ఆలోచించుకొన్నకొద్దీ ఆ కథలు రాసింది మీరేనా అనిపిస్తూవుంది నాకు. నేను చాలామంది రచయితల్ని ఎరుగుదును. ఎక్కువ మంది ఇంతే! వాళ్ళ రచనల్లో వెలిబుచ్చే అభిప్రాయాలుఎంత అభివృద్ధిదాయకంగా వుంటై! కాని ప్రవర్తన మామూలు మనిషి ప్రవర్తనకంటే అధ్వాన్నంగా వుంటుంది. దీనికి, భావాలను, ఆలోచనలను, ఆచరణలోకి, అనుభవంలోకి తీసుకురావాలనే ప్రయత్నం లేకపోవటమే కారణం అనుకుంటాను. మీ విషయంలో ఇట్లా వుండదని కుతూహల పడ్డాను. కాని మీరూ అంతే! సాధారణంగా రచయితల్లో వుండే బలాలు బలహీనతలూ, ఉద్రేకాలూ, ఆవేశాలూ అన్నీ మీలోనూవున్నాయ్.

“మీరు మారాలి - దయచేసి మారాలి. ఈ మాట నేను మీకు మీవూళ్ళో వున్నప్పుడే చెప్పాను. మళ్ళీ చెపుతున్నాను. నేను ఇంతగా ఎందుకు చెపుతున్నానంటే, మీలో ఇన్ని బలహీనతలు ఉన్నా మీరంటే నాకు ఇష్టం. అందుకని మిమ్మల్ని బాగుచెయ్యాలనే కోర్కె నాలో గాఢంగా వుంది. దీనికి నాకు ఒక్కటేదారి కనిపిస్తూవుంది. మీరు లేడీస్ క్లబ్బు ఒక్కటి ఆర్గనైజ్ చెయ్యండి. ఆ క్లబ్బుకి మీరే సెక్రటరీగా వుంటే మరీ మంచిది. నేను చాలా సంతోషిస్తాను. అశ్రద్ధ వొద్దు. జాడ్యం ముదరనిస్తే తరువాత ఎంత ప్రయత్నించీ లాభం వుండదు.

“లేడీస్ క్లబ్బుకి సెక్రటరీగా వుంటే నాకు ఊపిరి సలపదు. నాకు అట్లా అవటం ఇష్టం వుండదు,” అని మహాపతివ్రత పోజు పెట్టకండి. వూరికే అట్లా అంటారుగాని ఊపిరి సలపక ఏమవుతుంది? ఎంతసేపూ ‘నేను అందంగా, తెలివిగామాట్లాడుతున్నానా లేదా?’ అనే గొడవేగాని సహజంగా మాట్లాడుదాం అనిగానీ, యదార్థం మాట్లాడుదాం అనిగానీ మీకు ఎందుకు ఉండదు? సంఘానికి జడిసి బానిసలయి చిట చిటలాడుతూ, రుసరుసమంటూ కాలంగడిపే పతివ్రతగా మీరు వుంటం నాకు ఇష్టంలేదు.

“ఇక సెలవు. నేను మనసిచ్చి, రాయదలచుకుందంతా రాశాను. మీరుకూడా అట్లాగే ప్రవర్తించాలని నా కోర్కె. తప్పకుండా జవాబు రాయండి.

“అయితే, ఏమండీ, అడగటం మరచి పోయానూ, సిని

మాలో సంపెంగపువ్వు చేతికిస్తే, సినిమా అయ్యేదాకా వాసన చూస్తూ కూర్చుంటారా? వాసన చూట్టానికేనా సంపెంగపువ్వు లిచ్చేది? పువ్వులు ఎందుకు పుట్టినయ్? వాసన చూట్టానికి సెలయేరు ఎందుకు ప్రవహిస్తూవుంది? గానం చెయ్యటానికి. మంచిగంధంచెట్టు ఎందుకు పుట్టింది? పాములకు ఆశ్రయం ఇవ్వటానికి. ఇంతేగాని వీటన్నిటికీ మానవుడు పరిస్థితుల్ని బట్టి కొత్త కొత్త అర్థాలు సృష్టించుకుంటాడనిగాని మాటలతో చెప్పుకోటానికి వీల్లేని భావాలను వీటిద్వారా చెప్పుకుంటాడని గానీ మీకు తెలియదు. మీరంతా ఎంత ప్రిమిటివ్‌గా వున్నారండీ! పైగా నేను నంగనాచినని ప్రచారం! నేనుకూడా ప్రిమిటివ్‌గా వున్నాననేనా మీ వుద్దేశం? — ఉండాలని ఆపేక్ష కామాలు.

ఇట్లు

మీ

"——"

P. S.

లక్ష్మణశాస్త్రి రాసిన ఉత్తరం కామేశ్వరుడు చూశాడు. చూడగానే గుక్కలుపట్టి నవ్వుకున్నాడు. ఇప్పటికీ జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా, ఒంటరిగావున్నా సరే, అలా నిలబడిపోయి నవ్వుకుంటూ వుంటాడు. ఒకమాట చెప్పటం మరచిపోయాను. ఆ ఉత్తరం చూసినప్పటినుంచీ కామేశ్వరుడికి మీమీద చాలా ప్రేమ కుదిరింది.

"——"

ఇదీ వుత్తరం-ఆమె దగ్గరనుంచి వొచ్చిన ఉత్తరం. ఈఉత్తరం చదువుకొని నేను ఏమయ్యానో మీకు తెలుసుకోవాలని వుంటుంది.—నెలరోజులు ఖాయిదా పడ్డాను.

---

## భార్యాలోలుడు

"నువ్వు పెద్దవాడివి. పదిమందికి నీతులు చెప్పవలసినవాడివి. నువ్వే ఇట్లాచేస్తే ఎట్లాచెప్పు?" అని అడిగాడు క్రిష్ణయ్య రామ్మూర్తిని.

క్రిష్ణయ్య రామ్మూర్తి స్నేహితుడు. ఏదోపనిమీద వొచ్చినట్టు అదీ ఇదీ మాట్లాడి, అసలు గ్రంథంలోకి దిగాడు.

రామ్మూర్తికి క్రిష్ణయ్యమాటలు అర్థంకాలేదు. కాని ఏదో సీరియస్‌గా సలహాచెప్పటానికి వొచ్చాడనే విషయం మాత్రం తెలిసింది.

"ఇప్పుడు నేనేం చేశాను? సరిగ్గా చెప్పు. లేకపోతేనాకు ఎట్లా తెలుస్తుంది?" అన్నాడు.

క్రిష్ణయ్య కొంచంసేపు తటపటాయించాడు. తాను చెప్పదలచింది ఎట్లా మొదలు పెట్టాలా అని ఆలోచించాడు. ఇలా అన్నాడు—"నీ భార్య మంచిదే అవ్వొచ్చు. నేను కాదనను. కాని నువ్వుమాత్రం కొంచం మంచీ చెడ్డా ఆలోచించుకోనక్కర్లా? ఆమె చెప్పిందంతా నమ్మటమే!" అన్నాడు.

"అసలు సంగతేమిటో చెప్పవోయ్—నానుడు బేరంతో చంపకా"

అన్నాడు రామ్మూర్తి.

రామ్మూర్తికి, క్రిష్ణయ్య చెప్పదలచింది చూచాయగా తెలిసినట్లుంది.

"నువ్వు నీభార్య చెప్పిన మాటలు విని నీ చుట్టాలందరితోనూ పోట్లాడుతున్నావటగా! అదేమంత మంచిపని చెప్పు? ఎవరికన్నా తెలిస్తే ఏమనుకుంటారు?" అని అడిగాడు.

రామ్మూర్తి ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు—"ఈసంగతి నీకు ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

"నా భార్య చెప్పింది."